భోజనాలు పూర్తయ్యాక ఇద్దరూ బెడ్ రూంలో పడుకున్నారు.

"ఏమిటే ఇంకా కబుర్లు, మీ ఆయన ఎలా వున్నారు? సంసారం ఎలా వుంది?" అని ప్రశ్నించింది భారతి.

పూర్ణ ముఖంలో నీలినీడలు చోటుచేసుకున్నాయి, మౌనంగా వుండిపోయింది ఆమె. భారతి ఆదుర్దాగా—

పూర్ణా! అలావున్నావేమిటి? నేనడిగిన ప్రశ్నకు జవాబు చెప్పవేం?" అని అడిగింది కాస్త అనుమానంగా

"ఏంచెప్పమంటావు భారతీ! అవిటిమనిషితో సంసారాన్ని గురించి "ఏంచెప్పుకోను?" అన్నది నిర్లిప్తతతో పూర్ణ.

"మీ ఆయన అవిటివాడా? మీ పెళ్ళికి నేను రాలేకపోవటంతో ఆయన్ను చూడ్డం వీలు కాలేదు." అని మళ్ళీ— "ఏమిటీ! మీ పెళ్ళికి ముందు నీ భర్త అవిటివాడని నీకు తెలీదా?" ఆశ్చర్యంగా అడిగింది భారతి తన ఫ్రెండ్ పూర్ణని.

"శరీరానికి సంబంధించిన అవిటితనమైతే తెలుసుకునివుండేదాన్నేమో కాని ఆయనకున్న అవిటితనం శరీరానిది కాదు. మనస్సుది" అన్నది పూర్ణ బాధగా!

"ఏమిటే పూర్ణా నువ్వంటున్నది? నాకేమీ అర్థంకావటంలేదు." అన్నది భారతి.

పూర్ణ చెప్పటం ప్రారంభించింది.

"ఇలాంటి విషయాలు నలుగురితో చెప్పుకోలేను. ప్రాణ స్నేహితురాలివి కాబట్టి నీకు చెప్పకుండా ఉండలేకపోతున్నాను. చూపులకు ఆయన ఎంత అందంగా వుంటారో? అంతఃకరణంలో అంత వికారి. ఆడవాళ్ళంటే గౌరవంలేదు. స్త్రీలను చులకనగా మాట్లాడ్డం, ఎద్దేవ చేయడం ఆయన సహజగుణాలు. నామీద ప్రతిక్షణం అనుమానమే." కాలేజీ చదువు వెలగబెట్టావు కదా? ఎవ్వరినీ ప్రేమించలేదా." అంటూ సందేహిస్తారు. "ఇంత అందంగా వున్నావు?" నీ కోసం ఎవ్వరూ ప్రయత్నించలేదా?" అంటూ సంస్కారహీనంగా మాట్లాడతారు. మగవాళ్ళతో మాట్లాడితే అనుమానం, వీధిలో నిలుచుంటే తిడతారు. "నీతో సంబంధం వున్న మొట్టమొదటి మగాణ్ని నేనే కదూ!" అంటూ అసహ్యకరంగా మాట్లాడుతారు. ఈ పరిస్థితులలో నా మనసు అగ్నిగుండంలా వుడికిపోతూంది. ఈ బాధను భరించలేకపోతున్నాను" అంటూ దిండులో తలదాచుకుని వెక్కి వెక్కి ఏడ్వడం ప్రారంభించింది పూర్ణ!

మౌనంగా స్నేహితురాలి వీపు మీద చేయి వేసి అనునయించసాగింది భారతి.

—ఇ. టి. రామారావు
(శ్రీహరికోట)

# నిజాయితీ

గది తలుపు చప్పుడయితే భర్తేమోనని ఆత్రంగా వెళ్ళి తలుపు తీసింది పూర్ణ.

ఎదురుగా స్నేహితురాలు భారతి సూట్ కేస్ పట్టుకొని చిరునవ్వుతో కనిపించింది.

పెళ్ళికి పిలిస్తే బారసాలకొచ్చారన్నట్టుగా ఇన్నాళ్ళకు నామీద దయకలిగిందా, అని నిష్ఠూరంగా మాట్లాడుతూ భారతిని లోనికి ఆహ్వానించింది పూర్ణ.

పూర్ణ పెళ్ళికి తనెందుకు రాలేకపోయిందో సంజాయిషీ చెప్పడం మొదలుపెట్టింది భారతి.

స్నేహితురాళ్ళిద్దరూ గతం నెమరువేసుకుంటుండగా సతీష్ ఆఫీస్ నుండి వచ్చాడు.

భారతిని భర్తకు పరిచయం చేసింది. భారతి రెండు చేతులూ ఎత్తి నమస్కరించింది. ప్రతిగా అతను కుడి చెయ్యి దర్జాగా జేబులో వుంచుకొనే సెల్యూట్ చేసినట్టుగా ఎడం చేత్తో విష్ చేసి లోనికెళ్ళాడు.

అతని ప్రవర్తనకు భారతికి ఒళ్ళు మండింది.

"మీ ఆయనకు బొత్తిగా మర్యాద తెలియనట్టుంది" కోపం అణచుకోలేక లోనుండి వచ్చిన పూర్ణతో అంది భారతి.

"ఒక చేత్తోటే విష్ చేశారని అలా అంటున్నావు. ఆయనకుమరి కుడిచెయి మోచేతి వరకూ లేదు మరి" అంది పూర్ణ.

"ఏమిటి, మీ పెళ్ళికి ముందు నీ భర్త అవిటివాడని నీకు తెలీదా?" ఆశ్చర్యంగా అడిగింది భారతి తన ఫ్రెండ్ పూర్ణని.

"తెలుసు"

"మరెందుకు చేసుకున్నావీ పెళ్ళి" భారతి అడిగింది బాధగా.

"ఆ రోజు నా పదహారో పెళ్ళి చూపులు. నాన్న యింట్లోకి వీధిలోకి ఆత్రంగా తిరుగుతున్నారు. అమ్మ ఈ సంబంధమైనా ఖాయమయేలా చూడమని కనపడని దేవుళ్ళకు మొక్కుకుంటున్నది. తమ్ముళ్ళు చెల్లాయిలు పెళ్ళివాళ్ళకని తెచ్చిన స్వీట్స్ తామూ తినొచ్చని ఆశగా ఎదురు చూస్తున్నారు.

పెళ్ళివారొచ్చి కూర్చున్నాక నన్ను తీసుకెళ్ళారు. ఎప్పుడొచ్చిన్న భాగోతమే కదా అని నేను నిర్లిప్తంగా కూర్చున్నాను.

మీ అమ్మాయి నాకు నచ్చింది. నేను నచ్చానో లేదో అన్న గొంతు విని తలెత్తి చూశాను. ఇద్దరికళ్ళూ కలుసుకున్నాయి. సిగ్గుతో తలొంచుకున్నాను.

"నేను చెప్పమన్నది దాపరికం లేకుండా చెప్పారా పేరయ్య గారూ" అతను అడిగాడు.

బాబూ! మీరు మంచి ఉద్యోగం చేస్తూ కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకొంటున్నారు .... అదే పది వేలంటూ" నసిగాడు పేరయ్య.

ఆగి ఆపండి. అయ్యా సుబ్బరామయ్య గారూ ఫ్యాక్టరీ మెషిన్ చక్రంలో పడి నా చెయ్యి మోచేయి వరకూ పోయింది నాకు అబద్ధం ఆడి పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేదు. మీ అమ్మాయికి, మీ కుటుంబ సభ్యులకు నచ్చితే కబురు చెయ్యండి" అతను వెళ్ళిపోయాడు.

నేను ఆలోచనలోపడ్డాను. అడిగినంతకట్నం ఇవ్వలేమని తెలిసి నాకు లేని అవలక్షణాలు అంటగట్టేవారు కొందరయితే, చేసేది చిన్న గుమాస్తా ఉద్యోగమైనా గాని గొంతెమ్మకోర్కెలు కోరే వారు ఇంకొందరు సర్వ వ్యసనాలు వుండి కూడా బుద్ధిమంతులమని అబద్ధాలు చెప్పే వారు మరి కొందరూ వున్న ఈ రోజుల్లో అతని నిజాయితీ నాకు నచ్చింది.

"అదే పెళ్ళయిన తరువాత చెయ్యిపోతే కాపురం చెయకుండా వదిలేస్తారా ఎవరైనా" అంది పూర్ణ.

భారతి తన తొందరపాటుకి సిగ్గుపడింది.

"పూర్ణా" అన్న భర్త పిలుపు విని ఇప్పుడే వస్తానంటూ లోనికి వెళ్ళింది పూర్ణ.

"అందగాడని మోజుపడి ఆనందంగా పెళ్ళి చేసుకుంటే రోజుకో అమ్మాయిని యింటికే తీసుకొచ్చి తన కళ్ళ ముందే కులుకుతుండటం గుర్తొచ్చిన భారతి పూర్ణ భర్త నిజాయితీని మనసులోనే అభినందించింది.

—దంతులూరి వర్మ
(విశాఖపట్నం-3),

స్రవంతి నెం. 22లో ఇచ్చిన "ఏమిటి, మీ పెళ్ళికి ముందు నీ భర్త అవిటివాడని నీకు తెలీదా" ఆశ్చర్యంగా అడిగింది భారతి తన ఫ్రెండ్ పూర్ణని.

వాక్యం ఆధారంగా రాసిన కథలు

## ఓ కథ రాయండి

ఈ క్రింది ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడైనా ఉపయోగించి అచ్చులో ఆరపేజీ మించకుండా ఓ కథరాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచయితలకి పాతిక రూపాయలు పారితోషికం పంపబడుతుంది.

*'ఆ ప్రకాశ్, ఈ ప్రకాశ్ ఒకడేనా?' కాకుంటే బావుండునని మనసులో అనుకుంటూ నడుస్తోంది జానకి.*